
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.8
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 9 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	586.00 (300.3200)	3,74,304	3,14,544
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	161.91	161.91
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	167.91 (35.45)	2,54,698	2,42,601

చికెన్ ధరలు	లైవ్ : రూ.103	డ్రెస్ : రూ.150	స్కిన్‌లెస్ : రూ.170



సాగర్‌కు పోటెత్తిన వరద

నాగార్జునసాగర్‌కు ఎగువనుంచి వరద పోటెత్తింది. దీంతో సాగర్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం వరకు 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదలచేసిన అధికారులు గురువారం ఉదయం ఎగువ నుంచి వరద రాక స్థిరంగా కొనసాగడంతో మరో ఎనిమిది క్రస్ట్‌గేట్లను ఎత్తి మొత్తం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్‌నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక పులిచింతల ప్రాజెక్టుకు గురువారం సాయంత్రానికి 2,54,698 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 11గేట్లను ఎత్తి 2,30,601 క్యూసెక్కులు, విద్యుత్ కేంద్రం ద్వారా 12వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

• 6లో..

పంటకాల్వల నిర్వహణపై

పట్టింపేదీ?

- నిడమనూరు, త్రిపురారం మండలాల్లో దెబ్బతిన్న కాల్వలు
- నేరేడుచర్లలో ఇళ్లలోకి వస్తున్న ఊటనీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, స్థానికులు



నిడమనూరు మండలంలో పంట కాల్వలకు మరమ్మతు చేసుకుంటున్న రైతులు

ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. దీంతో సాగర్ ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తుండగా, ఈ కాల్వ పరిధిలోని చిన్న, పెద్ద కాల్వల నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల కాల్వలకు గండ్లు పడగా, మరి కొన్ని ప్రమాదకరంగా మారాయి. నిడమనూరు మండలంలోని ఎల్ 4-5 ఎత్తిపోతల పథకం నిర్వహణ అధ్వానంగా మారింది. ఈ పథకం కింద కాల్వల నిర్వహణను కొన్నాళ్లు ప్రభుత్వం చూసినా, తర్వాత రైతులకే వదిలేయడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రెండేళ్లుగా కాల్వకు నీళ్లు లేకపోవడంతో భూములు బీడుగా మారాయి. ఈ ఏడాది సాగర్ జలాశయంలో సమృద్ధిగా నీరు చేరి కాల్వలకు నీటిని విడుదల చేయడంతో లిఫ్టు రైతులకు కూడా సాగుపై ఆశలు కలిగాయి. కానీ పంట కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అదే విధంగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణం నుంచి వెళుతున్న ఆర్-3 సాగర్ కాల్వలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని టౌన్‌హాల్ సమీపంలోని ఇళ్లలోకి ఊట నీరు వచ్చి చేరుతోంది. దీంతో రెండు రోజులుగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

•7లో..

- నిడమనూరు, నేరేడుచర్ల

సూర్యాపేటలో బిత్తిరి సత్తిపై కేసు

● భగవద్గీతను అపహాస్యం చేశాడని ఫిర్యాదు

•7లో..

దర్జాగా కారులో వచ్చి చోరీ

● నిందితుల నుంచి రూ.9లక్షలు స్వాధీనం



మండుటెండలో చేతులకు బొబ్బలు వచ్చేలా కష్టపడ్డ కూలీలకు వేతనాలు సకాలంలో అందడంలేదు. కరువు కాలంలో కటుంబ అవసరాలకు ఉపాధిహామీ పథకం సొమ్ము అక్కరకు వస్తుందన్న ఆశతో పనులకు హాజరైన కూలీలకు నిరాశే మిగిలుతోంది. ప్రతీ రెండు వారాలకు ఓ సారి అందాల్సిన వేతనాలు నెలలు గడిచిపోతున్నా రావడం లేదు. దీంతో కూలీలు బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ నిరీక్షిస్తున్నారు.

- మిర్యాలగూడ అర్బన్

10 వారాలుగా పైసా ఇవ్వలే!

- ఉపాధి వేతనాల కోసం కూలీల నిరీక్షణ

ఉపాధి హామీ పథకంలో భాగంగా పని చేసిన పనికి అనుగుణంగా వేతనాలు లెక్కించి,ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదైన హాజరు శాతాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రతీ వారం వేతనాలను సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియంతా క్షేత్రస్థాయిలో పూర్తవుతున్నా సకాలంలో కూలీల వేతనాలు రావడం లేదు. కేంద్రగ్రామీణాభివృద్ధి సంస్థ గతంలో ఉన్న రాగాస్ సాఫ్ట్‌వేర్ స్థానంలో ఈ ఏడాది నుంచి నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసీ) అమల్లోకి తెచ్చింది.ఈసాఫ్ట్‌వేర్‌లోని నేషనల్ మొబైల్‌మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)లో కూలీల హాజరు ను ఫీల్డ్‌అసిస్టెంట్లు అప్‌లోడ్ చేస్తున్నారు.పోర్టల్‌లో ఉదయం, మధ్యాహ్నం నమోదైన పని ఫొటో, కూలీల హాజరు,ఎంబీ రికార్డులో నమోదైన కొలతల ఆధారంగా వేతనాల చెల్లింపు సజావుగా కొనసాగడం లేదు.

రూ.97కోట్లు బకాయి

ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ పథకం పనులకు హాజరైన కూలీలకు నాలుగైదు వారాల వేతనాలు మాత్రమే బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ చివరి వారం నుంచి జూలై మాసాంతం వరకు పనిచేసిన కూలీలకు వేతనాలు రావాల్సి ఉంది. ఒక్కో కూలీకి సగటున ఏడు నుంచి తొమ్మిది వారాల్లో కష్టపడ్డ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రూ.97.67కోట్ల వేతనాలు కూలీలకు బకాయి ఉంది. నల్లగొండ జిల్లాలో 5,12,082మంది కూలీలకు రూ.22.82కోట్లు చెల్లించాల్సి ఉండగా, తాజాగా రూ.7.68లక్షల విడుదలై ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో) స్థాయిలో పెండింగ్‌లో ఉంది. సూర్యాపేట జిల్లాలో 3,94,818మంది పనులు నిర్వహించగా, రూ.50కోట్ల పైచిలుకు బకాయిలు ఉన్నాయి. అందులో రూ.2.67లక్షల బిల్లుల చెల్లింపు ఎఫ్‌టీవో స్థాయిలో నిలిచాయి. యాదాద్రి జిల్లాలో 2,01,953 మంది కూలీలకు చెందిన రూ.24.75కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండగా, రూ.1.36లక్షల ఎఫ్‌టీవోలె పెండింగ్‌లో ఉన్నాయి.

సమస్య నివృత్తిలో జాప్యం

ఉపాధిహామీపథకం అమలులో తలెత్తే సమస్య ఏదైనా ఆన్‌లైన్‌లోనే నివృత్తిచేయాల్సి ఉంటుంది. అందుకు ఎన్ఐసీ పోర్టల్‌లో వివిధ వెబ్‌సైట్‌లను కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. దీనిపై కొంతమంది కంప్యూటర్ ఆపరేటర్లుకు (సీవో) అవగాహన లేదు. దీంతో కూలీలకు సంబంధించిన సమస్యలకు క్షేత్రస్థాయిలో పరిష్కారం లభించక అవస్థలు పడుతున్నారు. కొన్నిమండలాల్లో చాలామంది కూలీలు కేవైసీ చేయించినా, నేటికీ ఒక్క పైస వేతనం రాలేదు. రాగాస్ నుంచి ఎన్ఐసీకి జాబ్‌కార్డులు అప్‌లోడ్ చేసే క్రమంలో కొందరు కూలీల జాబ్‌కార్డులు జాబితాలో కనిపించకుండాపోయాయి. ఆయా కుటుంబాలు పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్‌అసిస్టెంట్లతో వాగ్వాదానికి దిగడంతో కొత్తజాబ్‌కార్డులు కేటాయించారు. దినసరి వేతనాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే సందర్భంలో తలెత్తే సమస్యను పరిష్కరించకుండా కొందరు కూలీల వర్క్‌డిమాండ్, అలకేషన్‌ను సీవోలు రద్దుచేసి మస్టర్‌రోల్ బిల్లు చేయడంతో కూలీలకు నష్టం జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ విషయాన్ని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదని బాధిత కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మే మొదటి వారం వరకు వేతనాలిచ్చాం

ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలుతో వేతనాల చెల్లింపులో కొంత కాలయాపన జరిగింది. మే నెల మొదటివారం వరకు కూలీల ఖాతాలో వేతనాలు జమయ్యాయి. పెండింగ్‌లో ఉన్న మిగతా వేతనాలన్నీ సాధ్యమైనంత త్వరలోనే చెల్లించేందుకు శాఖాపరమైన చర్యలు చేపట్టాం. జిల్లాలో జాబ్‌కార్డులో నమోదై ఉన్న కూలీలందరి కేవైసీ పూర్తిచేశాం. కూలీల వేతనాల చెల్లింపు ప్రక్రియలో తలెత్తే సాంకేతికపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించాం. వేతనాల కోసం కూలీలు ఇబ్బందిపడాల్సిన అవసరం లేదు. పనిచేసిన ప్రతీ ఒక్కరి ఖాతాల్లో బిల్లులు జమచేస్తాం. ఈ దఫా ఉపాధిహామీ పథకానికి విశిష్ట అదరణ లభించింది. లేబర్ బడ్జెట్ దాదాపు 90శాతం మేర పూర్తయింది.

- నాగిరెడ్డి, నల్లగొండ డీఆర్‌డీవో

పదివారాల్లో ఒక్కపైసా జమకాలేదు

ఉపాధి పనులకు ఏటా హాజరయ్యా. ఈ ఏడాది జాబ్‌కార్డులో నాపేరు కనిపించలేదు. అధికారులను నిలదీస్తే కొత్తగా జాబ్‌కార్డు ఇచ్చారు. ఆకార్డుతో 10వారాలు పనికి వెళితే ఇప్పటి వరకు ఒక్కపైస రాలే దు. విషయాన్ని మండలస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

- నన్నెబోయిన సైదులు, ఉపాధికూలీ, వేములపల్లి

చెల్లింపులపై ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

వరుసగా అమల్లోకి వచ్చిన అసెంబ్లీ, పార్లమెంటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉపాధిహామీ కూలీల వేతనాల చెల్లింపుల్లో జాప్యం ఏర్పడింది. ఎన్నికల ప్రక్రియ ముగిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలన చేపట్టినా వేతనాల చెల్లింపునకు గ్రహణం వీడడం లేదు. పనులకు హాజరయ్యే కూలీల్లో అధికశాతం నిరక్షరాస్యులు కావడంతో ఎవరిని అడగాలో అర్థంగాక పడిగాపులు కాస్తున్నారు. కార్యాలయాలు, గ్రామాల్లో అందుబాట్లో ఉండే సిబ్బందిని ప్రశ్నిస్తున్నా, వారు సైతం దీనిపై స్పష్టత ఇవ్వలేక చేతులెత్తేస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది కూలీల హాజరుశాతం గణనీయంగా పెరిగింది. గ్రామాల్లో వ్యవసాయ పనులు దొరక్కపోవడం, వలస వెళ్దామనుకున్నా కరువుకాలం కావడంతో కూలీలంతా స్వగ్రామాలకే పరిమితమయ్యారు. చిన్న, సన్నకారు రైతుకుటుంబాలు సైతం ఉపాధిపథకాన్ని ఆదరించారు. ఈ నేపథ్యంలో హాజరయ్యే కూలీల సంఖ్య అధికమైంది. దీంతో ప్రతీ గ్రామ బడ్జెట్‌లో 80 నుంచి 90శాతం పనులు సైతం ఇప్పటికే పూర్తయ్యాయి. జూలై మాసాంతంలో ఉపాధిహామీ పనులు పూర్తయ్యాయి. మారిన నింబంధనల మేరకు అధికారులు రెండు పూటల పనులు చేయించినా డబ్బు మాత్రం సకాలంలో రావడం లేదు. ఎన్నికలకోడ్, వార్షిక బడ్జెట్ రూపకల్పన తదితర కారణాలతో ఏప్రిల్ నుంచి కూలీలకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. పథకం కింద ఖర్చయ్యే నిధుల పర్యవేక్షణ బాధ్యతలను కేంద్రగ్రామీణాభివృద్ధిశాఖ తన పరిధిలోకి తీసుకోవడంతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఈ పథకాన్ని అంతగా పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. ఫలితంగా వేతనాల చెల్లింపు విషయంపై స్థానిక అధికారులు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు.

పథకానికి మహిళా శక్తి..

ఉమ్మడి జిల్లాలో 8,78,659 జాబ్‌కార్డులు ఉండగా, 19,77,973మంది కూలీలుగా నమోదయ్యా రు. వారిలో 10,06,078 మంది పురుషులు, 9,71,895 మం ది మహిళా కూలీలు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఉపాధి హామీ పథకాన్ని 11.08లక్షల మంది కూలీలు ఆదరించ గా, పనులకు హాజరైన వారిలో పురుషుల సంఖ్య 4.99లక్షలు ఉండగా, మహిళా కూలీల సంఖ్య 6.09లక్షలుగా ఉంది. 55శాతం మంది మహిళలు ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. నల్లగొండ జిల్లాలో 4,05,263 జాబ్ కార్డుల్లో 9,24,947మంది కూలీలు నమోదవ్వగా 5,12,082 మంది పనులకు హాజరయ్యారు. సూర్యాపేట జిల్లాలో 2,97,375 జాబ్‌కార్డుల్లో 6,82, 153మంది కూలీలు నమోదుకాగా, 3,94,818 మంది పనులు నిర్వహించారు. యాదాద్రి జిల్లాలో 1,76,021 జాబ్‌కార్డుల్లో 3,70,873మంది కూలీలు ఉండగా, 2,01,953 మంది ఉపాధి పనుల్లో పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే అంటువ్యాధులు దూరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

హాలియా, ఆగస్టు 8: వ్యక్తిగత శుభ్రతతోనే 90శాతం వ్యాధులను అరికట్టవచ్చని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. గురువారం హాలియాలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో ఏర్పాటు చేసిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు పారిశుధ్యం,ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందకుండా వ్యాధులబారిన పడకుండా ఉంటారన్నారు. డెంగీ, మలేరియా, వీధికుక్కల నుంచి రక్షణపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మునిసిపాలిటీలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని ఆయన వెంట కమిషనర్ మున్వర్‌అలీ,మేనేజర్ అబ్దుల్ రసీద్, టీఎంసీ జి.వసంత్‌కుమార్, ఇంజనీర్ రవికుమార్,వార్డు ఆఫీసర్ అనూష ఉన్నారు.

పండుగ వాతావరణంలో స్వాతంత్ర్య దినోత్సవం

ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్



నల్లగొండ టౌన్, ఆగస్టు 8: ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా స్వాతంత్ర్యదినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వతంత్ర దినోత్సవం నిర్వహించన్నుట్లు తెలిపారు. అందుకు సంబంధించి మైదానంలో ఏర్పాట్లను ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించాలని, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్య అతిథి సందేశానికి సంబంధించిన నోట్స్ ను ఈ నెల 12లోగా జిల్లా అధికారులు సీపీవోకు పంపాలన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం చూడాలని మున్సిపల్ కమిషనర్‌ను, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలకు జిల్లా విద్యాశాఖ అధికారి, డీపీఆర్‌వో సంయుక్తంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్ వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో, విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలపై శకటాలను రూపొందించాలని, స్టాల్స్ ఏర్పాటు చేయాలని, వీటికి సంబంధించిన వివరాలను సోమవారంలోగా సమర్పించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఇచ్చే ప్రశంసా పత్రాలకు పేర్లను ఈ నెల 13 నాటికి కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. పతాకావిష్కరణలో తప్పనిసరిగా ప్రోటోకాల్ నిబంధనలను పాటించాలని, తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ, స్వాతంత్ర వేడుకల్లో గార్డ్ ఆఫ్ హానర్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపుకలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ పరివర్తన్' ద్వారా కార్యక్రమాలు

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా 'మిషన్ పరివర్తన్'లో భాగంగా ఈ నెల 9 నుంచి 14 వరకు ఆయా శాఖల ద్వారా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఇదే రోజున అన్ని స్థాయిల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, పాటల పోటీలు నిర్వహించాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని డీఈవోను 12న ఎక్సైజ్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మానవహారం, ర్యాలీలు నిర్వహించాలన్నారు. మునిసిపాలిటీల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. 13న రైతువేదికల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యువతను, రైతులను ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలన్నారు. ఈ సందర్భంగా వీడియోలను, ఆడియోలను ప్రదర్శించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ర్యాలీలు నిర్వహించాలన్నారు. 14న అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో పెద్ద ఎత్తున ముగింపు సమావేశం నిర్వహించాలన్నారు. ఈ సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ విద్యార్థులను సైతం భాగస్వామ్యం చేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అధికారులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్)లో కొనసాగుతున్న భూ సర్వే

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 8: పైలట్ ప్రాజెక్టులో భాగంగా రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ సర్వే మండలంలో గురువారం కొనసాగింది. తహసీల్దార్ల నేతృత్వంలో ఐదు బృందాలు రైతుల పొలాల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించాయి. చింతలపాలెం గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నెంబర్ 158, 162లో, తిమ్మాయిపాలెంలో సర్వే నెంబర్ 39లో, తునికినూతలలో సర్వే నెంబర్ 45లో, నెల్లికల్ సర్వే నెంబర్ 425లో జీపీఎస్ ఆధారిత సర్వే నిర్వహించారు. తునికినూతల రెవెన్యూ శివారులో నిర్వహించిన సర్వేను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. కాస్తు కబ్జాలో ఉన్న ప్రతీ ఒక్కరికి పాస్‌పుస్తకాలు అందుతాయని, అందుకు సర్వే అధికారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమాల్లో ఆయా బృందాల రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 8: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి అన్నారు. గురువారం వారు స్థానిక ఏరియా ఆసుపత్రి, వేములపల్లి,తిప్పర్తి పీహెచ్‌సీలను తనిఖీచేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు సిజేరియన్ల వల్ల కలిగే నష్టాలను వివరించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు జరిగేలా కృషి చేయాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో వైద్యులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ప్రతీ వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. గ్రామాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకొని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి రక్త నమూనాను సేకరించాలన్నారు. ఎవరికైనా జ్వరం ఉంటే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు. వైద్యులు 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జ్వరాల బారిన పడుతున్నవారికి తగిన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా సమయానికి ఆస్పత్రికి వచ్చి రోగులకు వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరద్,డీటీసీవో కల్యాణ్‌చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు గీతావాణి, కేస రవి, వేణుగోపాల్‌రెడ్డి, ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ వహీదా, డాక్టర్ సుచరిత, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అడవిదేవులపల్లి, ఆగస్టు 8: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు అన్నారు. గురువారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు చేపట్టిన హెల్త్ సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలు ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి రోగులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మొల్కచర్ల మండల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంపీడీవో కరుణాకర్‌రావు, ఎంపీవో మోసిన్‌బిన్‌అహ్మద్, మెడికల్ అధికారి రామాంజనేయులు, ఏపీవో సూరనాయక్, తదితరులు ఉన్నారు.

సాగర్‌కు పోటెత్తిన వరద

నాగార్జునసాగర్, మేళ్లచెర్వు, కేతేపల్లి, ఆగస్టు8: నాగార్జునసాగర్‌కు ఎగువనుంచి వరద పోటెత్తింది. దీంతో సాగర్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం వరకు 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదలచేసిన అధికారులు గురువారం ఉదయం ఎగువ నుంచి వరద రాక స్థిరంగా కొనసాగడంతో మరో ఎనిమిది క్రస్ట్‌గేట్లను కూడా ఎత్తి మొత్తం 26 క్రస్ట్ గేట్ల ద్వారా సాగర్‌నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 3,74,304 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో సాగర్ నీటిమట్టం 586 అడుగులకు (300.3200టీఎంసీలకు)చేరుకుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా ప్రస్తుతం 586 అడుగులుగా (300.3200టీఎంసీలుగా) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8,144 క్యూసెక్కుల నీటిని ఎడమ కాల్వ ద్వారా 8,193 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,501 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, 22 క్రస్ట్ గేట్లను ఐదు అడుగులమేరకు నాలుగు గేట్లను 10అడుగుల మేర ఎత్తి 2,67,906 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి మొత్తం 3,14,544 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 3,74,304 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

పులిచింతల ప్రాజెక్టుకు నిలకడగా కొనసాగుతున్న వరద

ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టుకు వరద నిలకడగా కొనసాగుతోంది. కృష్ణానదికి నాగార్జునసాగర్ నుంచి వరద కొనసాగుతుండటంతో బుధవారం సాయంత్రం 2,50,518 క్యూసెక్కులుగా నమోదైన వరద గురువారం సాయంత్రానికి ఇంచుమించు అదే విధంగా 2,54,698 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, గురువారం సాయంత్రం 167.91 అడుగులు (35.45 టీఎంసీలు)గా నమోదైంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12వేల క్యూసెక్కులు, ప్రాజెక్టు మొత్తం గేట్లు 24 కాగా.., ఆరు గేట్లను 2.50 మీటర్లు ఎత్తి, ఐదు గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి, మొత్తం 11గేట్ల ద్వారా 2,30,601 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 2,42,601 టీఎంసీలుగా నమోదైంది. నీటి లభ్యత నిలకడగా ఉండటంతో వచ్చిన నీటిని వచ్చినట్టే అధికారులు దిగువనున్న ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలనుంచి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. గురువారం సాయంత్రానికి కొంతమేర తగ్గి 161.91 క్యూసెక్కులుగా నమోదైంది. 645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యంగల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం గురువారం సాయంత్రానికి 641.50అడుగులు (3.57టీఎంసీ)లుగా ఉంది.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి



చింతపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

చింతపల్లి, ఆగస్టు 8: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యనందించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి నర్సింహారెడ్డి అన్నారు. గురువారం చింతపల్లి మండలంలోని కుర్మపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను నాణ్యమైన విద్యనందించి, వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసి బంగారు భవిష్యత్‌కు అధ్యాపకులు తోడ్పాటు అందించాలన్నారు. అసంపూర్తిగా నిర్మించిన గదులను త్వరగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయనవెంట జేడీ వెంకటనర్సమ్మ, ఆర్‌జేడీ మదన్‌మోహన్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నర్సింహారెడ్డి, మదన్‌మోహన్, విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. వారివెంట వెంట హెచ్ఎం నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

చేతిగోటిపై వందేమాతర గేయం

● గోటి చిత్రకారుడు జానయ్య ప్రతిభ



గోరుపై జాతీయ గేయాన్ని చూపుతున్న జానయ్య

కనగల్, ఆగస్టు 8: మండలంలోని బుడుమర్లపల్లి గ్రామానికి చెందిన గోటి చిత్రకారుడు, కనగల్ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ కారింగు జానయ్యగౌడ్ తన ప్రతిభను మరోసారి చాటాడు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని తన 9 సెం.మీ. పొడవు, 1.5 సెం.మీ.ల వెడల్పు గల కుడి చేతి బొటనవేలి గోటిపై వందేమాతర గేయంతోపాటు, జాతీయ జెండాను చిత్రించి పలువుర్ని అబ్బురపరుస్తున్నాడు. ఇంతకుముందు వివిధ సందర్భాల్లో తన గోటిపై చిత్రాలను గీసి, అవార్డులను అందుకున్నాడు.

రైతులు నష్టపోకుండా చూడాలి

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 8: నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి, మిర్చి, వరి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు బ్రాండెడ్ పేర్లతో కల్తీ విత్తనాలు మార్కెట్లోకి వస్తున్నాయన్నారు. నిరంతరం సంబంధిత అధికారులు సీడ్ ఫర్టిలైజర్స్ దుకాణాలపై నిఘా కొనసాగించి నకిలీలను అరికట్టి రైతులు బలికాకుండా చూడాల్సిన అవరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, భావండ్ల పాండు, తిరుపతి రామ్మూర్తి, కోటిరెడ్డి, లక్ష్మీనారాయణ, గౌతంరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పంటకాల్వల నిర్వహణపై పట్టింపేదీ?

● ఎల్4-5 ఎత్తిపోతల నిర్వహణ అధ్వానం ● దెబ్బతిన్న పంట కాల్వలు.. పట్టించుకోని ప్రభుత్వం ● కాల్వలు బాగు చేసుకుంటున్న రైతులు





నిడమనూరు మండలంలోని ఎల్ 4-5 ఎత్తిపోతల పథకం, గండ్లు పడకుండా రైతులు ఏర్పాటు చేసుకున్న సీసీ

నిడమనూరు, ఆగస్టు 8: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని వేంపాడ్, ముప్పారం, త్రిపురారం మండలంలోని జీ.అన్నారం గ్రామంలోని బీడు భూములను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశ్యంతో వేంపాడ్ సమీపంలో సాగర్ ఎడమ కాల్వ వద్ద నిర్మించిన ఎల్ 4-5 ఎత్తిపోతల పథకం నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో ఆయా గ్రామాల రైతులు సాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు గ్రామాల్లోని 1,850 ఎకరాలకు సాగర్ నీటిని అందించేందుకు 1994లో ఈ లిఫ్టు ఇరిగేషన్‌ను నాటి వ్యవసాయ మంత్రి కుందూరు జానారెడ్డి ప్రారంభించారు. కొన్నాళ్లు లిఫ్టును ప్రభుత్వమే నిర్వహించింది. కానీ తర్వాత ఎత్తిపోతల పథకం నిర్వహణను ప్రభుత్వం రైతులకు వదిలేయడంతో అప్పటినుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. లిఫ్టు నిర్వహణ రైతులకు భారంగా మారింది. ఈ ఎత్తిపోతల పథకం కింద 1,850 ఎకరాలు ఆయకట్టు స్థిరీకరించినప్పటికీ కనీసం ఏనాడు 500 ఎకరాలకు సక్రమంగా సాగునీరు అందిన దాఖలాలు లేవు. విద్యుత్ మోటార్లు కాలిపోవడం, కాల్వలు పూడిపోవడం వంటి తదితర కారణాలతో సక్రమంగా నీరందడం లేదు. లిఫ్టుకు చివరన ఉన్న ముప్పారం రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. పంటల సాగుకోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. సాగునీటికోసం నానా తిప్పలు పడుతున్నారు. రెండేళ్లుగా కాల్వకు నీళ్లు లేకపోవడంతో భూములు బీడుగా మారాయి. ఈ ఏడాది సాగర్ జలాశయంలో సమృద్ధిగా నీరు చేరి కాల్వలకు నీటిని విడుదల చేయడంతో లిఫ్టు రైతులకు కూడా సాగుపై ఆశలు కలిగాయి. కానీ పంట కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాల్వల్లో కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. గూనల కింద అనేక చోట్ల పెద్ద ఎత్తున గండ్లు పడటంతో నీరు వృథా అవుతున్నందున పంటలకు నీళ్లు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేదు. కాల్వలు అధ్వానంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం తక్షణమే పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో లిఫ్టు కింద పంటలు పండించుకోవాలనే ఉద్దేశ్యంతో ముప్పారం గ్రామానికి చెందిన పలువురు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నాలుగు రోజులుగా పంట కాల్వలను వారే బాగు చేసుకున్నారు. జేసీబీతో కంపచెట్లు, పూడిక తొలగించుకోవడంతోపాటు గండ్లు పడిన చోట నీరు వృథా కాకుండా పటిష్టంగా సీసీ ఏర్పాటు చేసుకున్నారు. గూనలు ఏర్పాటు చేసిన స్థలంలో బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. బ్రిడ్జి నిర్మిస్తే పొలాలకు సక్రమంగా నీళ్లు అందడంతోపాటు ముప్పారం చెరువు కూడా నింపే అవకాశం ఉంది. లిఫ్టు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లిఫ్టు రైతులకు సక్రమంగా నీరందించాలి



ఎల్4-5 లిఫ్టు కింద సక్రమంగా నీరు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దెబ్బతిన్న పంట కాల్వలను ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రైతులమే బాగు చేసుకున్నాం. గూనలు ధ్వంసమై గండ్లు పడుతున్నందున, అక్కడ బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగంగా ఉంటుంది. ప్రభుత్వం లిఫ్టు రైతుల సమస్యలు పరిష్కరించాలి.

తెలకపల్లి శంకర్, రైతు, ముప్పారం.

అంచనాలు తయారు చేస్తున్నాం

పంట కాల్వల్లో పెరిగిన కంపచెట్లను తొలగించాం. కాల్వలను బాగు చేసుకుంటామని రైతులు ముందుకొస్తే కొంతమేరకు మేము కూడా సహకరించాం. తగిన మరమ్మతులకు కావాల్సిన వ్యయంపై అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

శ్రీనివాస్, ఐబీ డీఈ.

ఇళ్లలోకి ఊట నీరు

● ఇబ్బంది పడుతున్న ప్రజలు ● కట్ట ఆక్రమణ వల్లే సమస్యలు : డీఈ

నేరేడుచర్ల, ఆగస్టు 8: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణం నుంచి వెళుతున్న ఆర్-3 సాగర్ కాల్వలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని టౌన్‌హాల్ సమీపంలోని ఇళ్లలోకి ఊట నీరు వచ్చి చేరుతోంది. దీంతో రెండు రోజులుగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లోని వస్తువులన్నీ తడిసిపోయాయి. మూడు ఇళ్లలో ఇదే పరిస్థితి ఉంది. కాల్వలో ఉన్న చెత్త తీసివేస్తే సమస్య తగ్గుతుందని బాధితులు వాపోతున్నారు.

కాల్వను పరిశీలించిన ఎన్నెస్పీ డీఈ

విషయం తెలుసుకున్న ఎన్నెస్పీ డీఈ అమరేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆర్3 కాల్వ వెంట నీరు వస్తున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాల్వ కట్టల ఆక్రమణల వల్లే ఈ సమస్య ఏర్పడిందన్నారు. గృహాలు ఉన్న వైపు అసలు కట్ట లేకుండా తీసివేయడం వల్లే నీరు లోనికి వస్తుందన్నారు. కాల్వకు 68 క్యూసెక్కుల నీటిని వదలాల్సి ఉండగా, 65 క్యూసెక్కులే వదులుతున్నామని, ఇప్పుడు 50క్యూసెక్కులకు తగ్గించినట్లు తెలిపారు. నీటిని తగ్గిస్తే కాల్వ చివరి భూముల రైతులకు నీరు చేరదని, పెంచితే కాల్వకట్టలు ఆక్రమించుకున్న చోట నీరు ఇళ్లలోకి వస్తుందన్నారు.

చెత్త తొలగించాలి



40 ఏళ్లుగా నివాసం ఉంటున్నా ఎప్పుడు ఈ సమస్య రాలేదని, కాల్వలో చెత్త, చెట్లు పెరగడం వల్ల ఈ సమస్య దాపురించింది. వెంటనే చెత్త తొలగించాలి. తొలగిస్తే ఊట నీరు రాక కుండా ఆగిపోతుంది.

యరమళ్ల వెంకటమ్మ, నేరేడుచర్ల



ఇళ్లలోకి చేరిన కాల్వ ఊట నీరు

దర్జాగా కారులో వచ్చి.. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు

● నిందితుల నుంచి రూ.9 లక్షల నగదు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ, ఆగస్టు 8: దర్జాగా కారులో వచ్చి.. పొలాల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకొని చోరీచేస్తున్న ఐదుగురిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల గ్రామానికి చెందిన మెగావత్ రంగానాయక్, అదే జిల్లాలోని మాచవరం మండలంలోని సింగరాయపాలెంతండాకు చెందిన జటావత్ ఇమామ్‌నాయక్, షేక్ జటావత్‌వలీ నాయక్, జటావత్ మౌలానానాయక్, నల్లగొండ జిల్లా చందంపేట మండలం ఎలమలమంద గ్రామానికి చెందిన కేతావత్ సునీల్ రెండు సంవత్సరాలుగా హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో నివాసం ఉంటున్నారు. నేర ప్రవృత్తి ఉన్న ఈ ఐదుగురు ట్రాన్స్‌ఫార్మర్లలోని వస్తువులను చోరీచేసి హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఈ ముఠా సభ్యులు కారులో హైదరాబాద్ నుంచి బయలుదేరి రోడ్డు పక్కన వ్యవసాయ పొలాల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేస్తున్నారు. ఇప్పటివరకు వాడపల్లి, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ, వేములపల్లి, త్రిపురారం, నిడమనూరు, తిప్పర్తి, నల్లగొండ, నకిరేకల్, చిట్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ పొలాల వద్ద రైతులు మోటార్లకు కరెంటు సరఫరా నిమిత్తం ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. కాపర్ కాయిల్స్‌ను, ఆయిల్‌ను తస్కరించి ఎవరికీ అనుమానం రాకుండా తమ కారులో హైదరాబాద్‌లోని ముడావత్ సుజాత, నరేష్‌లకు తక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వాడపల్లి ఎస్ఐ రవి తమ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో నర్సాపురం రోడ్డులోని రైల్వేట్రాక్ వద్ద ఒక తెలుపు రంగు కారు పొలాల వద్ద నిలిపి ఉండటంతో పాటు ఐదుగురు వ్యక్తులు కనిపించారు. వారు పోలీసులను చూసి అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో వారిని విచారించడంతో నేరాలు అంగీకరించారు. అరెస్టు చేసిన నిందితులపై నల్లగొండ జిల్లాలోని 13స్టేషన్ల పరిధిలో 34కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.9లక్షల నగదుతో పాటు ఒక కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పాత ఇనుము వ్యాపారస్తులు పరారీలో ఉన్నారు. ఈ దొంగల ముఠాను మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో వాడపల్లి ఎస్ఐతో పాటు సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

వారానికి రూ.200 ఇవ్వాల్సిందే!

● పీఏపల్లిలో సామాజిక తనిఖీలో రుజువైన వైనం

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 8: ఉపాధి హామీ పథకంలో మండలస్థాయిలో పనిచేసే ఉద్యోగి ఉపాధిహామీ కూలీలనుంచి లంచాలు తీసుకున్న విషయం సామాజిక తనిఖీలో రుజువయింది. ఈ అంశంపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా అడిట్ అధికారులు నివేదికను జిల్లా అధికారులకు పంపినట్లు తెలిసింది. పెద్దఅడిశర్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో 15 ఏళ్లగా విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగిపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధిహామీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న గిరిబాబు 15 ఏళ్లగా ఒకే చోట పనిచేసే అవకాశం ఏవిధంగా ఇచ్చారనేది ఉద్యోగుల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

గత ప్రభుత్వంలోని నేతలను అడ్డం పెట్టుకొని..

గిరిబాబు గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులను అడ్డంపెట్టుకుని కార్యాలయంలోని ఉన్నత అధికారులపై ఒత్తిడి చేసి అనుకున్న పనులు చేయించుకునేవారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత 2020లో బదిలీల్లో భాగంగా చందంపేట మండలానికి వెళ్లిన అప్పటి ప్రజాప్రతినిధుల అండతో రెండు నెలల్లోనే తిరిగి యథాస్థానానికి వచ్చారంటే అతని పైరవీలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థంచేసుకోవచ్చు. ఫీల్డ్ అసిటెంట్లు లేని చోట టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న గిరిబాబు మండలంలోని దుగ్యాల, రాంపురం, చిలకమర్రి,పెద్దగట్టు, నంబాపురం, తిరుమలగిరి గ్రామపంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తూ ఉపాధి కూలీలకు పనులు కల్పించే క్రమంలో కొలతలు తీసుకుని ఎంబీ చేయాలంటే ప్రతి కూలీ వారానికి రూ.200 టీఏ గిరిబాబుకు ముట్టజెప్పాలి. లేదంటే చెల్లింపులు చేసేవారు కాదు. చేసినా తక్కువ మొత్తం చెల్లించేవారు. ఉపాధి హామీ పనులకు రాకున్నా వారంలో చివరి రోజు వచ్చి సంతకం పెట్టి డబ్బులు ముట్టజెప్పితే మస్టర్‌లో పేరు రాసి వారికి మొత్తం డబ్బులు ఇచ్చేవారన్న ఆరోపణలున్నాయి. అంతేకాకుండా పండ్లతోటలు ఏర్పాటు చేద్దామనుకుంటే ముందుగా రైతులు ఆయన అడిగిన డబ్బులు ఇస్తేనే ఎస్టిమేషన్ వేసేవారని, లేకుంటే రైతులను ఇబ్బందులకు గురిచేసేవారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పెద్దగట్టు గ్రామపంచాయతీలో గత మేలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆ ఒక్క గ్రామ పంచాయతీలో 500 మంది కూలీలు ఉపాధిహామీ పనులు చేసినట్లు రికార్డులో పేర్లు ఉన్నాయి. ఒక్క ఉపాధికూలీ వద్ద రూ.200 వసులు చేశారన్న ఆరోపణలున్నాయి. కొంతమంది బాధితులు మాత్రమే వచ్చి అడిట్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదుచేశారు. ఫిర్యాదు స్వీకరించిన అధికారులు గ్రామపంచాయతీల్లో విచారణ జరపగా, నిజమేనని తెలియడంతో ఆ నివేదికను డీఆర్‌డీవో అధికారికి పంపినట్లు తెలిపారు. ఇదే విషయమై ఎంపీడీవో చంద్రమౌళిని వివరణ కోరగా.. సామాజిక తనిఖీలో కూలీలు ఫిర్యాదు చేసింది వాస్తవమే. సామాజిక తనిఖీ అడిట్ అధికారులు ఆ నివేదికను జిల్లా అధికారులకు పంపించారన్నారు.

అడ్లూర్‌లో వైద్య శిబిరం

● అదుపులో విష జ్వరాలు

శాలిగౌరారం, ఆగస్టు 8: శాలిగౌరారం మండలంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుండటంతో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. అక్కడక్కడ డెంగీ కేసులు కూడా నమోదవుతున్నాయి. మండలంలోని అడ్లూర్‌లో కేసులు కూడా నమోదవుతున్నాయి. మండలంలోని అడ్లూర్ గ్రామంలో గతంలో నాలుగు రోజుల నుంచి జ్వర పీడితులు ఎక్కువకావడంతో మండల వైద్యాధికారి సూర్యశిల్ప గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ క్యాంప్‌లో వైద్య సిబ్బంది 92 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఇంటింటికి తిరిగి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వైద్య శిబిరంలో పీహెచ్ఎన్ రాములమ్మ, సూపర్‌వైజర్ మరియా, దయామణి, ఏఎన్ఎంలు సుమతి, సునిత, ఆశావర్కర్లు కొమరమ్మ, సునీత, రేణుక ఉన్నారు. ఇదిలా ఉంటే అడ్లూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీడీవో జ్యోతిలక్ష్మి గురువారం సాయంత్రం పరిశీలించారు. వైద్య సిబ్బంది రోగులకు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. వైద్య సిబ్బంది రోగులకు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. ప్రజల ఆరోగ్య విషయంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● భువనగిరి బైపాస్ రోడ్డుపై అదుపు తప్పిన కారు



యాదగిరిగౌడ్(ఫైల్)

భువనగిరి టౌన్, ఆగస్టు 8: భువనగిరి బైపాస్ రోడ్డుపై బుధవారం అర్ధరాత్రి కారు అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. పట్టణ ఎస్ఐ కుమార స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టకు చెందిన స్నేహితులు ఆరె యాదగిరిగౌడ్ (70), సుక్కల సత్యం, ఆకుల నర్సింహారావు, పయ్యావుల శ్రీను, ఒంటేరు నారాయణరెడ్డి పనుల నిమిత్తం బుధవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి బైపాస్ రోడ్డులోని కేంద్రీయ విద్యాలయం ఎదుట వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో యాదగిరిగౌడ్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన సుక్కల సత్యం ఆకుల నర్సింహారావును హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా ఐసీయూలో చికిత్సలు అందిస్తున్నారు. మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు పంచాయతీ రాజ్ శాఖ విశ్రాంత ఉద్యోగి కాగా ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. ఆయన పెద్ద కుమార్తె డాక్టర్ ఇందిర భువనగిరిలో ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ను నిర్వహిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో ఘటనలో ఇంజనీరింగ్ విద్యార్థి..

భువనగిరి పట్టణశివారులోని డాల్ఫిన్ హోటల్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి జిల్లా బేతంపూడి మండలం సుజాతనగర్‌కు చెందిన కంగాల ఆదర్శ్ (29) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈ మేరకు బైక్‌పై సొంత ఊరికి వెళ్తుండగా డాల్ఫిన్ హోటల్ సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆదర్శ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ప్రమాదం జరిగే సమయానికి ఆదర్శ్ హెల్మెట్ ధరించినప్పటికీ క్లిప్స్ పెట్టకపోవడంతో హెల్మెట్ ఎగిరిపడి అతని తలకు తీవ్రగాయాలై మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. కాగా భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌కు చెందిన మేడబోయిన యాకేష్, ఉపాధి నిమిత్తం కొనుగోలు చేసిన నూతన లారీకి పూజలుచేసి ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా ప్రమాదం జరిగిన తీరుపై కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొన్నది. ఆదర్శ్ జేబులో దొరికి ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో విద్యార్థి...



అరుణ్(ఫైల్)

కనగల్, ఆగస్టు 8: హైదరాబాద్‌లోని మల్లారెడ్డి కళాశాల(సూరారం బ్రాంచ్)లో బీఎస్సీ (అగ్రికల్చర్) రెండో సంవత్సరం చదువుతున్న మండలంలోని తిమ్మన్నగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి ఐతగోని అరుణ్(21) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందాడు. కళాశాలలో పరీక్ష రాస్తున్న సమయంలో అరుణ్ ఒక్కసారిగా కింద పడిపోయినట్లు సమాచారం. దీంతో కళాశాల సిబ్బంది అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా అప్పటికే అరుణ్ మృతి చెందాడని డాక్టర్లు గుర్తించారు. ఇదిలావుంటే అరుణ్ మృతితో తిమ్మన్నగూడెంలో విషాదచాయలు అలుముకున్నాయి. అరుణ్ తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ తమ కుమారుడు ఉన్నతస్థితికి ఎదగాలని ఖర్చులకు వెనుకాడకుండా రూ.లక్షలు వెచ్చించి చదివిస్తున్నారు. ఈక్రమంలో కుమారుడి మరణ వార్త విన్న అరుణ్ తల్లిదండ్రులు ఐతగోని సైదయ్య, సావిత్రమ్మ రోదనలు మిన్నంటాయి. వీరికి ఇద్దరు కుమారులుండగా అరుణ్ పెద్దకుమారుడు. అరుణ్ ఇంటర్ వరకు నల్లగొండలో చదువుకున్నాడు.

సూర్యాపేటలో బిత్తిరి సత్తిపై కేసు నమోదు

● భగవద్గీతను అపహాస్యం చేశాడని ఫిర్యాదు

సూర్యాపేట క్రైం, ఆగస్టు 8: టీవీ యాంకర్, నటుడు బిత్తిరి సత్తిపై సూర్యాపేట జిల్లా కేంద్రంలో కేసు నమోదైంది. సూర్యాపేట టూ టౌన్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతను అపహాస్యం చేస్తూ హైదరాబాద్‌కు చెందిన బిత్తిరి సత్తి అలియాస్ రవికుమార్ వీడియోలు రూపొందించి సోషల్ మీడియోలో ప్రచారం చేస్తున్నాడని సూర్యాపేటకు చెందిన కట్టంగూరి సంతోష్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హిందువులను కించపర్చిన బిత్తిరి సత్తిపై చర్యలు తీసుకుని క్షమాపణ చెప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు బిత్తిరి సత్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వివాహమై ఎనిమిదేళ్లు గడుస్తున్నా పిల్లలు కావడం లేదని నల్లగొండలో మహిళ, అప్పుల బాధతో సూర్యాపేట జిల్లాలో మరో మహిళ, చిలుకూరు మండలంలో కుటుంబానికి దూరంగా ఉంటున్నాననే మనస్తాపంతో బలవన్మరణం చెందారు.



ఇంద్రజ(ఫైల్)

నల్లగొండ టౌన్, ఆగస్టు 8: పిల్లలు కావడం లేదన్న బాధతో పాటు గత ఏడాది కాలంగా భర్తకు దూరంగా ఉండటంతో మానసిక వేదనకు గురైన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ మండలం తస్కనిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తస్కనిగూడేనికి చెందిన పాలకూరి ఇంద్రజ(23)కు పెళ్లయి ఎనిమిదేళ్ల కావొస్తున్నా పిల్లలుకాలేదు. దీంతో గత ఏడాదిగా భర్తకు దూరంగా ఉంటుంది. ఈ క్రమంలో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్న ఇంద్రజ బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తల్లి బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

అప్పుల బాధతో మహిళ

సూర్యాపేటక్రైం: అప్పులబాధతో మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గురువారం జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారాంపురానికి చెందిన బల్లుకూరి తిరుపతయ్యకు అదే ప్రాంతానికి చెందిన కళమ్మతో క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు కాగా ఇద్దరికీ వివాహాలయ్యాయి. కుమారుడు సందీప్ జల్సాలకు అలవాటుపడి అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వ్యక్తులు ఇంటికి వచ్చి కొడుకు చేసిన అప్పులను అడగడం తల్లి కళమ్మ(45) మనస్తాపం చెంది ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం జిల్లాకేంద్రంలోని నల్లచెర్వు వద్దగల అయ్యగారిబావిలో కళమ్మ మృతదేహాన్ని అటుగా వెళ్తున్న ఎల్లయ్యకు గుర్తించాడు. కళమ్మ కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా, పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిలుకూరు: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో ఉరివేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం ఈ ఘటన జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జిలకర రమేష్ (45) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ బేతవోలు గ్రామంలోని మైలారిశెట్టి రామకోటమ్మ ఇంట్లో కొంతకాలంగా నివాసముంటున్నాడు. గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన జిలకర రమేష్ భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ బేతవోలు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం 7 గంటల వరకు తన గదిలోంచి బయటికి రాకపోవడంతో యజమాని గది కిటికీలోంచి చూడగా ఇంట్లో దూలానికి రమేష్ ఉరివేసుకుని కనిపించాడు. దీంతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబానికి దూరంగా ఉంటూ మనస్తాపానికి గురై రమేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురభి రాంబాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్వచ్ఛదనం పచ్చదనంలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 8: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. దేవరకొండ పట్టణంలో గురువారం నిర్వహించిన ర్యాలీ పాల్గొన్నారు. అనంతరం జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పచ్చనిచెట్లు ప్రగతికి మెట్లని, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యభద్రత పాటించాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఇంటింటికి ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. అనంతరం స్వయం సహాయక సంఘాలతో సమావేశమై అందరినీ భాగస్వాములను చేయాలని కోరారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు వడ్త్య దేవేందర్‌నాయక్, హనుమంతు వెంకటేష్ గౌడ్, పున్న వెంకటేష్, శ్రీశైలంయాదవ్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సమాభావన సంఘాల నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలోకి గృహప్రవేశం చేసిన ఎమ్మెల్యే

దేవరకొండ: ఎమ్మెల్యే బాలునాయక్ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజలు చేసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డి-8, 9 లిఫ్టు విషయంలో నిర్లక్ష్యం తగదు



పంప్‌హౌజ్ వద్ద పనులను పరిశీలిస్తున్న భగత్

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 8: రెండు మండలాల రైతులకు ప్రయోజనం చేకూర్చే డి-8, 9 లిఫ్టు ప్రారంభించే విషయంలో నిర్లక్ష్యం తగదని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మండలంలోని పూల్యాతండా వద్ద ఎస్‌ఎల్‌బీసీ లోలెవల్ కెనాల్‌పై నిర్మిస్తున్న డి-8,9 లిఫ్టు వద్ద గురువారం ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 8వేల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో నిధులు కేటాయించి 95శాతం పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం మిగిలిన 5 శాతం పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తక్షణమే మిగిలిన పనులను పూర్తి చేసి సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. మారెపల్లి గ్రామంలో వరదకాల్వకు గండి పడి నాలుగు రోజులవుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కేతావత్ రవినాయక్, కూరాకుల వెంకటేశ్వర్లు, కొట్టె బాలయ్య, రమావత్ లక్ష్మణ్, రమావత్ రాజేష్, వడ్డె సతీష్‌రెడ్డి, ఆంగోతు గోపి, రవినాయక్, ముత్యాలు, శ్రీదేవి, రంగాచారి, బాలు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



బుద్ధదేవ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండరూరల్, ఆగస్టు 8: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్‌బ్యూరో మాజీ సభ్యుడు బుద్ధదేవ్ భట్టాచార్య ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, సీపీఎం(ఎం) సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య కోల్‌కత్తలో మృతి చెందారు. ఆయన మృతికి సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాలడుగు నాగార్జున, ప్రభావతి, హాశం, శంకరయ్య, నర్సిరెడ్డి, సత్తయ్య, పద్మ పాల్గొన్నారు.

నీటి లభ్యతపై స్పష్టత లేకపోవటం అన్యాయం

మునుగోడు, ఆగస్టు 8: డిండి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వకపోవటం, డీపీఆర్ ఆమోదం తెలపకపోవటం గత ప్రభుత్వం చేసిన అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మునుగోడులోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం సొరంగమార్గం (ఎస్‌ఎల్‌బీసీ) పనులను 30 నెలల్లో పూర్తి చేయిస్తామని జిల్లా మంత్రులు ఇచ్చిన మాట ప్రకారం పూర్తి చేయించి చిత్తశుద్ధి చాటుకోవాలని అన్నారు. నిర్ణీత కాలంలో పూర్తి చేసేందుకు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయటంతో జిల్లా తాగు, సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. నురిగి చలపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, బొల్గూరి నర్సింహ, వెంకటేశ్వర్లు, పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు బండమీది యాదయ్య, పాండు, లింగయ్య, వెంకన్న, రమేష్, కైలాష్, సత్తమ్మ, వెంకన్న, దయాకర్, లాలు, వెంకన్న, జానీ పాల్గొన్నారు.

డిండి ఎత్తి పోతల డీపీఆర్ ఆమోదించాలి

నల్లగొండ రూరల్: డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి ప్రభుత్వం వెంటనే పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆగస్టు 9వ నల్లగొండలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు. నల్లగొండలో జరిగే సదస్సులో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి

మిర్యాలగూడ, ఆగస్టు 8: ఎస్సీ వర్గీకరణ సాధించడంపై హైదరాబాద్‌లో జరిగే విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మచ్చ ఏడుకొండలు అన్నారు. పట్టణంలో గురువారం ఆయన ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30 ఏళ్ల పాటు మాదిగలు చేసిన పోరాటానికి దేశ అత్యున్నత న్యాయస్థానం న్యాయం చేకూర్చిందన్నారు. ఈ నెల 13న నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీలో మాదిగ సోదరులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంద్ర నాగరాజు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు కొమ్ము శ్రీనివాస్, సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మడుపు శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం నాయకులు కోట విజయ్‌కుమార్, బీజేపీ దళితమోర్చా జిల్లా కార్యదర్శి మంద శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, తిప్పర్తి, కనగల్, గుర్రంపోడు, మునుగోడు, ఆగస్టు 8: గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రామ పంచాయితీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు గురువారం జిల్లాలోని పలు మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ జీపీ కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 40 సంవత్సరాలుగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి నెలకు రూ.22వేల వేతనం, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు.

● కేతేపల్లిలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఆదిమళ్ల సుధీర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో కార్మికుల యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏడాకుల కోటయ్య, జి.ఆశీర్వాదం, కార్మికులు పి.వెంకటాచారి, ఎం.వెంకటేష్, పి.భద్రయ్య, లింగయ్య, పి.జానయ్య, రజిత, రమణ, ఆరోగ్యమ్మ, వెంకటమ్మ, లచ్చమ్మ పాల్గొన్నారు.



తిప్పర్తి: ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

● కట్టంగూరులో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మెలో కార్మికులు పెంజర్ల సైదులు, పొడిచేటి సులోచన, కాసర్ల స్వప్న, కత్తుల రామలింగయ్య, పొన్నంరాజు వెంకన్న, పార్వతమ్మ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న, జీపీ కార్మికులు గౌసోద్దీన్, ఎల్లయ్య, నర్సింహ, సతీష్, బుచ్చిరాములు, యాదమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

● తిప్పర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బీమగాని గణేష్, కార్మిక సంఘం నాయకులు మన్నెం భిక్షం, కార్మికులు చంద్రయ్య, కంచర్ల జానయ్య, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

● కనగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కానుగు లింగస్వామి, జీపీ కార్మికులు జిల్లా విజయ్, కొంగల నర్సింహ, దుబ్బ రవి, ముద్దం లింగయ్య, మంజుల, యాదయ్య, కిరణ్, సురేష్, ముత్తయ్య, అండాలు, శంకర్, యాదయ్య పాల్గొన్నారు.

● గుర్రంపోడులో జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు పగిడిమర్రి సర్వయ్య, ఉపాధ్యక్షుడు నీలం ఆంజనేయులు, జీపీ కార్మికులు యాదయ్య, శంకర్, నరేష్ పాల్గొన్నారు.

● మునుగోడులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, జీపీ కార్మికులు ఆర్.యాదగిరి, లింగయ్య, పెద్దమ్మ, ఎర్ర అరుణ, జలంధర్, యాదయ్య, శంకర్, అండాలు, సంపూర్ణ, లింగయ్య, లక్ష్మయ్య, నగేష్, యాదయ్య పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● *అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి*

మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, అడవిదేవులపల్లి, ఆగస్టు 8: యుద్ధ ప్రాతిపదికన చెరువుల మరమ్మతుల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయకట్టు విస్తీర్ణం ఎక్కువగా కలిగిన పెద్ద చెరువులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తూములు, గేట్లు, రాతి అలుగుల మరమ్మతులతో పాటు చెరువు కట్టపై ముళ్ల కంపల తొలగింపు, మట్టికట్టలు బలహీనంగా ఉన్న చోట బలోపేతం చేసే పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. ప్రధానంగా ఆమనగల్లు నల్లచెరువు, మిర్యాలగూడ పందిర్లపల్లి చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి రక్షణకు అవసరమైన చర్యలు తీసుకునే విధంగా చూడాలని అన్నారు. మరమ్మతుల పనులకు కావాల్సిన బడ్జెట్‌ను సంబంధిత మంత్రికి నివేదించి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం అడవిదేవులపల్లి మండలంలో నిర్మిస్తున్న దున్నపోతుల గండి ఎత్తిపోతల ప్రాజెక్టుపై సమీక్ష చేసేందుకు ఈ నెల 11న ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లిఫ్ట్ ప్రాంతాన్ని సందర్శించనున్నందున ఎమ్మెల్యే ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, ఇరిగేషన్ ఐబీ అధికారులు, నాయకులు బాలునాయక్, బండి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



లిఫ్ట్ పనుల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

● మిర్యాలగూడ మండలంలోని చింతలపాలెంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మొక్కలను నాటి ఇంకుడుగుంతలను తీసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటడం ఎంత ముఖ్యమో భూగర్భజలాలను పెంపొందించుకోవడానికి ఇంకుడుగుంతలను కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

తిప్పర్తి, మాడ్గులపల్లి, చింతపల్లి, ఆగస్టు 8: ఎన్నికల హామీ మేరకు ఎస్సీ డిక్లరేషన్ అమలుచేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలోని తిప్పర్తి, మాడ్గులపల్లి, చింతపల్లి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎస్సీలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయహస్తం కింద ఎస్సీ కుటుంబాలకు రూ. 12 లక్షల ఆర్థికసాయం, అన్ని కాంట్రాక్టులలో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్, ఇందిరమ్మ ఇళ్లు, సొంత ఇంటి నిర్మాణం కోసం రూ.6 లక్షలు వంటి హామీలు పూర్తి చేయాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్లకు అందజేశారు.

● తిప్పర్తిలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు పల్లె ప్రకాష్, నాయకులు వంగూరి రవి, నల్లబోతు రమేష్, సతీష్, వడ్డెపల్లి శ్రీను, ఆవుల జానయ్య, సైదులు, శంకర్ పాల్గొన్నారు.

● మాడ్గులపల్లిలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రమేష్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దాసరి నాగరాజు, బొమ్మకంటి నరసింహ, దాసరి యాదగిరి, ఇటికాల జాన్‌రెడ్డి, దారమళ్ల నాగరాజు, గిరి పాల్గొన్నారు.



చింతపల్లిలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

● చింతపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఎర్పుల యాదగిరి, పార్టీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గాదరి జంగయ్య, నాయకులు వెన్నం శేఖర్, మాసని సైదులు, శ్రీశైలం, అభినవ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

13న మాదిగల విజయ దండోరా



గాదె రమేష్

నల్లగొండ, ఆగస్టు 8: ఎస్సీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు మొదటిసారి వస్తున్న సామాజిక ఉద్యమ నేత మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు ఈ నెల 13వ తేదీన మాదిగల విజయ దండోరా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలుగా దండోరా ఉద్యమం నిర్వహించి మాదిగల చిరకాల స్వప్నమైన వర్గీకరణను సాధించినట్లు తెలిపారు. విజయోత్సవంతో తిరిగి వస్తున్న సందర్భంగా ఘనంగా స్వాగతం పలకాలని మాదిగల కు విజ్ఞప్తి చేశారు. ప్రతీ గ్రామం నుంచి వేలాది మంది హైదరాబాద్‌కు తరలిరావాలని కోరారు. మాదిగలకు హైదరాబాద్‌కు తరలించే క్రమంలో ప్రతి జర్నలిస్టు క్రియాశీలక పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో ఉన్న 4వేల మంది మాదిగ జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌కు రావాలని ఆయన కోరారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

చింతపల్లి, ఆగస్టు 8: సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి పూరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలి

● *బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి*



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

రామగిరి, ఆగస్టు 8: జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హర్, ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 15వ తేదీన పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్లో సామూహిక జాతీయ గీతాలాపన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతుల కోసం ప్రతీ గ్రామంలో రైతు రచ్చబండ పేరుతో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కర్నాటి సురేష్‌కుమార్, పోతేపాక సాంబయ్య, చినమోని రాములు, పోతేపాక లింగస్వామి, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



మిర్యాలగూడలో కోర్టు ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

మిర్యాలగూడ లీగల్, దేవరకొండ, ఆగస్టు 8: జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. అనంతరం కోర్టు ఎదుట నిరసన ప్రదర్శనతో పాటు కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకినాల వేలాద్రి మాట్లాడుతూ ఒక కేసు విషయమై మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులు గద్దల అమృతరావు, కవితలపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎండి.ఇబ్రహీం, ట్రెజరర్ ఎంవీ.పవన్‌కుమార్, న్యాయవాదులు మాలి ఉమాశంకర్‌రెడ్డి, రామరంగారావు, సుస్మిత, మల్లేష్, ప్రభాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకన్న, మంజునాద్, వేణు, కిరణ్‌కుమార్‌రెడ్డి, రవినాయక్, సతీష్, భవాని పాల్గొన్నారు.

● దేవరకొండలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, నెమ్మికంటి రమాశంకర్, బార్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

11న జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 8: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో సీనియర్ ఫుట్‌బాల్ మహిళ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్, చైర్మన్ గంట్ల అనంతరెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెంది ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు.

సాగర్‌లో వినియోగదారుల చైతన్య సదస్సు

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 8: సాగర్ హిల్‌కాలనీలో ఈ నెల 10, 11వ తేదీల్లో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు కాన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ తెలంగాణ కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ (క్యాట్కో) రాష్ట్ర నాయకులు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, అన్నెబోయిన మట్టయ్య తెలిపారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం సదస్సు పోస్టర్‌ను వారు విడుదల చేసి మాట్లాడారు. వస్తు సేవల్లో లోపాలు, పరిష్కార మార్గాలు, వినియోగదారుల చట్టాలు తదితర అంశాలపై సదస్సులో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం నిర్వహించనున్న వర్క్‌షాప్‌నకు 33 జిల్లాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. వినియోగదారులు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు బహునూతల వేణుగోపాల్‌రావు, దేవులపల్లి శ్రీనివాసాచారి, మస్తాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగదేవత అలంకరణలో రేణుకా ఎల్లమ్మ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్, ఆగస్టు 8: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో శ్రావణమాసం నాగచతుర్థి పురస్కరించుకుని గురువారం అమ్మవారు నాగదేవతగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా బోనాల పండుగ



అయిటిపాములలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

శాలిగౌరారం, కట్టంగూరు, ఆగస్టు 8: శాలిగౌరారం మండలంలోని శాలిగౌరారం, శాలిలింగోటం తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి, మాదారం, ఉట్కూరు, బండమీదిగూడెం, జాలోనిగూడెం, రామాంజపురం, మనిమద్దె తదితర గ్రామాల్లో బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి గ్రామంలో ప్రదర్శించారు.

● కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామంలో బోనాల పండుగను నిర్వహించారు. గ్రామశివారులో ఉన్న ముత్యాలమ్మకు బోనాలతో వెళ్లి మహిళలు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పెద్ది సుక్కయ్య, బెజవాడ సైదులు, నాగరాజు, వెంకట్‌రెడ్డి, కార్తీక్, సైదులు, సతీష్, శేఖర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఏవోగా మహ్మద్ సాదత్

● *బాధ్యతలు స్వీకరణ*



డీఏవో సాదత్

మిర్యాలగూడ, ఆగస్టు 8: డివిజినల్ పరిపాలనాధికారిగా మహ్మద్ సాదత్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు గురువారం ఆర్డీవోకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. గతంలో డీఏవోగా పనిచేసిన జ్యోతి పదవీవిరమణ చేయగా ఆమె స్థానంలో హైదరాబాద్ వక్ఫ్ బోర్డు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సాదత్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

సంక్షిప్త సమాచారం...

దామరచర్ల: కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులకు ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. బాధితులకు ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ధీరావత్ వీరన్ననాయక్, నాయకులు సింహాద్రి, దత్తు, చంటి పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపును శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జయరామయ్య తెలిపారు. సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.

కనగల్: పాడి గేదెల కొనుగోలుపై లబ్ధిదారులకు మండల సమాఖ్య కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ బాబు అధిక పాలు ఇచ్చే ముర్రా జాతి గేదెల గురించి వివరించారు.

చండూరు: రేషన్‌బియ్యాన్ని దళారులకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని డీటీసీఎస్ జ్యోత్స్న హెచ్చరించారు. పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

చండూరు: చండూరు పట్టణానికి చెందిన పాంపాటి మాణిక్యమ్మ పెద్ద హనుమంతు దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారుడు అమెరికాకు చెందిన పాంపాటి విద్యాసాగర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రూ.25 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. పాంపాటి భాస్కర్ హెచ్‌ఎం భిక్షంనకు అందజేశారు.

మిర్యాలగూడటౌన్: విద్యార్థులకు పరిశుభ్రత, పచ్చదనంపై పాఠాలు బోధించాలని మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ కోరారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడంతో పాటు ప్లాస్టిక్ నిషేధం, సీజనల్ వ్యాధులపై పలు పాఠశాలల విద్యార్థులకు వివరించారు.

చండూరు: చండూరు మునిసిపాలిటీలో 10 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకుల నిర్మాణం కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్ పథకం ద్వారా రూ.9.80 కోట్లు కేటాయించడాన్ని హర్షిస్తూ బీజేపీ ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కోమటి వీరేశం, సాంబయ్య, జనార్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, సత్యం, యాదగిరి, నాగార్జున, సోమశంకర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శాలిగౌరారం: మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులపై ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రాజెక్టుపై డ్రోన్ కెమెరా ఎగురవేశారన్న నెపంతో కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మహేశ్వరం వెంకన్న అన్నారు.

చండూరు, కనగల్: అడవుల సంరక్షణ, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చండూరు సీఐ వెంకటయ్య, కనగల్ ఎస్ఐ విష్ణు అన్నారు. మండలాలలోని పోలీస్‌స్టేషన్ల ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాలని సూచించారు.

వేములపల్లి: శిశువు జన్మించిన వెంటనే ముర్రుపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొంది ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. మండలంలోని మొల్కపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.

మిర్యాలగూడ టౌన్: ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీకి మాదిగలంతా తరలిరావాలని ఆ సంఘం నాయకులు మచ్చ ఏడుకొండలు, కొమ్ము శ్రీనివాస్, నాగరాజు, విజయ్, శివకుమార్, శ్రీను పిలుపునిచ్చారు.

దేవరకొండ: బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి తీవ్రంగా ప్రయత్నం చేసి పేదలకు అండగా నిలిచిన పండగ సాయన్న ఆశయ సాధనకు కృషి చేయాలని ముదిరాజు సంఘం పట్టణ అధ్యక్షుడు రసమళ్ల నారయ్య అన్నారు. సాయన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజు సంఘం నాయకులు తూటుపల్లి శ్రీను, రెడ్డిశంకర్, వెంకటయ్య, రాంబాబు, యాదయ్య పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీవో పి.సరళ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు పట్టించాలని, ఆరు నెలల అనంతరం అనుబంధ ఆహారం ఇవ్వాలని సూచించారు.

● పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ తమవంతుగా సహకారం అందించాలని మండల కార్యదర్శి డాకునాయక్ కోరారు.

మునుగోడు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తోందని ఎంపీడీవో పూజ అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేకంగా మంజూరు చేయించిన రూ. 5లక్షల విలువైన వీధి లైట్ల బిగింపు పనులను ప్రారంభించారు.

● **శాలిగౌరారం:** శాలిగౌరారం ప్రాజెక్టుకు స్వాతంత్ర్య సమరయోధుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత స్వర్గీయ చామల యాదగిరిరెడ్డి పేరు పెట్టాలని పలువురు రైతులు, నాయకులు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. శాలిగౌరారంకు చెందిన యాదగిరిరెడ్డి శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని కొనియాడారు.

బాధిత కుటుంబాలకు కైలాష్‌నేత చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న పున్న కైలాష్‌నేత

మునుగోడు, ఆగస్టు 8: మునుగోడులో పలు కుటుంబాలకు టీపీసీసీ జనరల్ సెక్రటరీ పున్న కైలాష్ నేత గురువారం చేయూత నందించారు. నేత కార్మికుడు మిర్యాల నాగరాజు తండ్రి మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను, రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన నేత కార్మికురాలు ముషం అరుణను పున్న కైలాష్‌నేత పరామర్శించారు. ఇరువురికి తనవంతు సాయంగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని అన్నారు. ఆయన వెంట జిట్టగోని యాదయ్య, సింగం గిరిధర్, ఇటుకలపాటి మధు, పందుల సంపత్, పందుల అశోక్, కాటం వెంకన్న, దొమ్మాటి లింగస్వామి, రేవెల్లి సైదులు, దుబ్బ రవి, ఉదయ్, యసరాణి దినేష్, సులేమాన్, నరేష్ తదితరులు ఉన్నారు.